కథానిక

# మరుగులోని మధురమూర్తి

పి. సరళాదేవి

అందరి జీవితంలోనూ కొందరు కొందరు మరువలేని మనుషులు ఉంటారంటారు. అలాగే నా జీవితంలోనూ కొందరు ఉండొచ్చు. కాని ఎప్పటికీ...ఆజన్మాంతమూ మరువలేనని నాకు తెలిసిన వాడు మూర్తే!

అతన్ని ప్రేమించానని చెప్పలేను. నిజానికి ప్రేమంటే ఏమిటో కూడా నాకు తెలియదు. ఇప్పుడు నేను ఆరుగురు పిల్లలతల్లిని. నా మనసులోని అతని రూపమే నా పెద్దాడిగా అవతరించాడేమో నని అప్పుడప్పుడు అనుమానం వేస్తూంటుంది.

పొట్టివాళ్ళలో పొడుగువాడుగా, పొడుగు వాళ్ళలో పొట్టివాడుగా, గోధుమవన్నె ఛాయతో ఎగిరెగిరి పడుతూండే ఉంగరాల జుత్తుతో, టెన్నిస్ బేటు పట్టుకుని సాయంత్రంవేళ క్లబ్బుకి పోతూ అతనిప్పటికీ కళ్ళముందు నుంచుంటాడు.

ఎవరైనా ఒకరొకరు తెలుసుకుని పరిచయంతో మొదలయి సన్నిహితులయితేనే—జ్ఞాపకముంటారంటారు. అదే నిజమయితే అతనినప్పుడే మరచిపోవలసింది. అతనిగురించి నాకు తెలిసిందల్లా అతని పేరు 'మూర్తి' అని మాత్రమే. అదీ ఎవరో పిలుస్తూండగా విన్నదే! దక్షిణామూర్తి, రాధాకృష్ణమూర్తి, రామూర్తి, సూర్యనారాయణమూర్తి — మొదలయిన చివర 'మూర్తి' వచ్చే పేర్లలో ఏదైనా కావచ్చు. కాని 'మూర్తి' 'మోహనమూర్తి'గా మాత్రమే నా హృదయంలో కొచ్చాడనుకుంటున్నాను.

నా గురించి ఆలోచిస్తాడనిగాని, తలచుకుని తలచుకుని తరలి వస్తాడనిగాని అనుకోను. అసలు నేనెవరో మూర్తికి తెలియదు. తెలియవలసిన అవసరం కూడా లేదు. ఇప్పుడు మంచి—అంటే, గుణగణాల్లోనూ, అందచందాల్లోనూ కాదు,—తన అభిప్రాయాలతో, అలవాట్లతోనూ, ఏకీభవించ గలిగినదే మగవాళ్ళ దృష్టిలోమంచి—భార్యతో హాయిగా కాలం గడుపుతూ ఉండొచ్చు.

మూర్తిని చూసి పదిహేనేండ్లయినా రోజూ అతన్ని చూస్తున్నట్టేవుంటుంది. పెద్దాడిని చూస్తే అతనుకూడా ఆశ్చర్యపోతాడేమో — నాలాగే ఉన్నాడేమిటా అని. కవలలకయినా అంత పోలిక వుండదు. ఇదంతా ఏమిటా అని ఒక్కొక్కప్పుడు నాకే ఆశ్చర్యంవేస్తుంది.

నాకు పెళ్ళి సంబంధాలు వెతుకుతూన్న కొత్తలో ఆ రోజు రాత్రి నాన్న అమ్మా అలా మాట్లాడుకోకుండావుంటే మూర్తి ఇన్నాళ్ళ నా హృదయంలో వుండేవాడా!

అప్పుడు నాన్న క్లబ్బు సెక్రటరీగా ఉండేవాడు. క్లబ్బుకి వస్తున్న యువకుల ప్రవర్తనలు కనిపెడుతో, పుట్టు పూర్వోత్తరాలు మంచి చెడ్డలు కనుక్కొంటో నాకు వరాన్వేషణ మొదలు పెట్టారు.

అలాంటి సమయంలో మూర్తి ఈవూరు రావడం తటస్థించింది. మా ఇంటి ముందునించే క్లబ్బుకి వెళ్తూండే వాడు.

ఒకరోజు రాత్రి నాన్న చెప్తున్నాడు. "ఈ దారంటే ఒకబ్బాయి క్లబ్బుకి వెళ్తుంటాడు. మంచి వాడు. సరస్వతికి మంచి ఈడూ జోడూ" అని. ఆ మాటలు దొంగతనంగా విన్నాను. ఈవిధంగానే నా వరాన్వేషణలోని ఘట్టాలన్నీ నాన్నదగ్గరనించి అమ్మ రాబడుతోంటే శ్రోతగా అమ్మకు సహాయం వెళ్ళేదాన్ని.

ఆ మాటలు విన్న మర్నాడు సాయంత్రం పక్కింటమ్మాయి రింగులీసుకునివస్తే డాబామీదికి వెళ్ళి ఆడుకుంటున్నాం. ఆడుతూంటే వీధికి ఆ చివర మూర్తి కనిపించాడు. ఆట మానేసి మాట్లాడుతూ పిట్ట గోడనానుకుని వీధిలోకి చూస్తున్నాము. మూర్తి కనిపించినది మొదలు కనుమరుగైపోయే వరకూ, రెప్పలార్పక, కళ్ళల్లోవుండే శక్తినంతా కేంద్రీకరించి చూశాను. ఆ నా చూపులే అద్దంమీద పడిన సూర్య కిరణాల్లా, అతనిమీద

నించి రిఫ్లెక్టయి నా హృదయంలో అతని రూపాన్ని చెరిగి, కరిగి, మాసిపోని ముద్రవేశాయి.

రోజూ మూర్తివచ్చే సమయానికి వీధి గుమ్మంలో హాజరవుతూండేదాన్ని.

ఆడవాళ్ళు గాలిమేడలు ఎక్కువ కడతారని, అందులోనూ వయసులో వున్నప్పుడు ఊహాగానాల్లోనే కాలం గడుపుతారని-ఎవరైనా అంటే అప్పుడు నమ్మలేక పోయేదాన్ని. కాని ఇప్పుడు నేను చేసిన ఊహాగానాలు తలుచుకుంటూంటే అది నిజమేనేమో ననిపిస్తోంది.

పెళ్ళి చేసుకున్న తరువాత, అతని సరసనే నడుస్తూ రోజూ సాయంత్రం షికారు వెళ్ళాలని, ఆ కాటుక పెట్టినట్లున్న నల్లని కళ్ళల్లోకి చూస్తూ కాలం గడిపేయాలని, సెలవుల్లో జంటపక్షుల్లా కొత్త కొత్త ప్రదేశాలు తిరగాలని...ఒకటేమిటి, ఎన్నెన్నో...ఏమిటేమిటో, మనసునించి వెలికి రాని, మాటల్లో చెప్పలేని వూహాల్లో-గాలిలో తేలిపోయే గడ్డిపోచల్లే తేలిపోయేదాన్ని.

పెళ్ళయినా నా వూహాల్లోలాగ అతను జరగనివ్వడేమో ననే అనుమానమే రాలేదు-అప్పుడు. అందుకే ఆడపిల్లలు జీవితంలో ఫెయిలవుతూంటారేమో!?

అప్పుడప్పుడు అతన్ని గురించి నాన్న అమ్మతో చెబుతున్న మాటలూ, రోజూ చూస్తున్న అతని రూపం నా వూహాలకు మరీ దోహదం చేసేవి.

మూర్తి నన్నెప్పుడూ గమనించలేదు. తన దారిని తను పోతూండేవాడు. కాని ఎప్పుడైనా-రోజూ సమయానికి వచ్చే నా వీధిలోని రాక, రెప్పలార్పక చూసే నా కళ్ళూ, ఆ సమయంలో నా ఆకారమూ—చూసేవుంటే వెంటనే ఆదారి మానేసి, దూరమైనా ఇంకో దారంటవెళ్ళడం మొదలుపెట్టివుండేవాడని ఇప్పుడనిపిస్తోంది.

వీధికి ఈ చివర వున్న హెల్త్ ఇన్స్పెక్టరు ఇంటికి అతను రోజూ వెళ్తూంటాడనీ, వాళ్ళకీ అతనికీ చాలదగ్గిర స్నేహమనీ నాన్న అమ్మతో చెప్పింది. నాచెవి లాక్కుంది. వెంటనే హెల్త్ ఇన్స్పెక్టరు భార్యతో స్నేహం చేసుకోవాలని, వాళ్ళింటికి వచ్చిన మనిషినిబట్టి నాన్న చెప్పినవాడూ, ఆ మూర్తీ ఒకరేనని స్థిరంచేసుకోవాలనుకున్నాను.

ఎలాగైతేనేం ఆమె స్నేహం సంపాదించాను. ఒకరింట్లో పేరంటానికి నేనూ ఆమెకూడా ఒకసారే వెళ్ళడం జరిగింది. ఎప్పుడెప్పుడు ఆమె స్నేహం చేసుకోవాలని ఆత్రుతపడుతున్నానేమో-ఆమె కనిపించగానే ఎప్పుడూ ఎవ్వరితోనూ మాట్లాడనంత ఎక్కువగా ఆమెతో మాట్లాడేసాను. ఆమెకూడా మరీ అంత పెద్దది కాదు—ఇద్దరు పిల్లలు. సరదాగా ఇద్దరం కలిసిపోయాం.

అప్పుడప్పుడు వాళ్ళింటికి వెళ్ళివస్తూండేదాన్ని. ఒకరోజు ధైర్యంచేసి మూర్తిని గురించి అడిగేద్దామని వెళ్ళాను. కాని అడుగుదామనుకుంటూనే సిగ్గుతో అడగలేక వచ్చేశాను. మరోరోజు ఎలాగైనా అడిగితీరాలని నిశ్చయం చేసుకున్నాను. మాట్లాడుతూ—

"ఏమండీ! బొద్దుగా, బూట్సు వేసుకుని ఒకాయన ఈదారంట వెళ్తూంటారు. అతను మీఇంటికి వస్తూంటారా?" అని అడిగాను నాన్నగారి మాటలతోనే—అడిగేసిన తరువాత జ్ఞాపకం వచ్చింది మూర్తికూడా బూట్సు వేసుకుంటాడని. ఇంత వరకూ నాన్నగారు చెప్పిన అతనూ, మూర్తి ఒకరో కాదోనని కొద్దిగా వెంట్రుకంతగా అనుమానం ఉండేది. ఇప్పుడు అదికూడా ఎగిరిపోయింది. దానికితోడు—

"ఆఁ వస్తూంటాడు, బలేవాడులే! గమ్మత్తుగా మాట్లాడుతాడు. మంచి ఇన్టరెస్టు కలుగుతుంది." అందామె. ఏ సముద్రమూ పొంగనంత ఎత్తుగా అప్పుడు నా హృదయం పొంగింది.

బలవంతాన నా అనుభూతిని అణచుకొని—

"పెళ్ళయిందా?" అన్నాను.

"లేదు. ఏం ఇంట్లో ఏమైనా అనుకుంటున్నారా?" అంది కాస్త దగ్గరగా జరిగి.

"ఊఁ నాకోసారి చూపిస్తారా?" అనేసి వల్లమాలిన సిగ్గుతో వొంగిపోయాను.

"ఛా ఛా ఎందుకంత సిగ్గు. నాకూ అనుభవమేలే ఇప్పటి నీ హృదయం. సాయంత్రం క్లబ్బు నుంచి వస్తున్నప్పుడు ఇక్కడికి వస్తాడు. చూద్దువుగానిలే" అంది వీపుమీద చేయివేసి నిమురుతూ. తరువాత అతని మాటల్ని చెబుతూ వూరికే నవ్వించింది.

చాలాసేపు కూర్చున్నాను కాని రాలేదు. "సినిమాకి వెళ్ళిపోయి వుంటారేమో. రేపు వేళ వుండగా అతన్ని తీసుకురమ్మని మా వారితో చెబుతాను. రేపు రా" అంది. నేను వచ్చేశాను.

మర్నాడు ఎలాగో అమ్మని మభ్యపెట్టేసి వెళ్ళాను. హెల్త్ ఇన్స్పెక్టర్ మూర్తిని తీసుకు వచ్చారు. నన్ను కిటికీలోంచి చూడమని చెప్పి ఆమె వెళ్ళి మూర్తితో మాట్లాడింది. నా గురించి చెప్పవద్దని వాగ్దానం తీసుకున్నాను, కాబట్టి చెప్పలేదు.

నా సందేహాలన్నీ పూర్తిగా తీరిపోయాయి. నాన్నగారు చెప్పినవాడూ మూర్తీ ఒకరే. మూర్తే కాబోయే... ఉన్న అనుభవాన్ని అది సంతోషమేగాని, విచారమేగాని రెండింతలు చేసుకునే వయసొకటా—అతన్ని తలంచని నిముషం లేకుండా సాయంత్రాలకోసం ఎదురుచూస్తో గడిపేదాన్ని.

మరికొన్ని వర్తమానాలు గతంలోకి మారాయి. గాబరాగా నాన్నవచ్చి అతను తల్లిదండ్రులతో పెళ్ళి చూపులకు వస్తాడని చెప్పారు.

ఆరోజు ఆనందం ఏమని చెప్పను? చర్మం చిట్లిపోయి రక్తం పొంగిపోతుందేమో అనుకున్నాను. ఎవరితోనన్నా మాట్లాడాలంటే మాటలు రాక ఏమన్నా తిందామంటే గొంతు దిగక పూరికే అటూ ఇటూ తిరిగేశాను.

అలంకరణమీద ఏదో మామూలుగా తప్పితే పె...ద్ద ఆసక్తిలేని నేను కూడా ఒక్కగంటసేపు అలంకరణ చేసుకున్నాను. ముందు రెండు రోజులనించీ జ్వరం అదీవస్తూ వంట్లో బాగులేదు. అముక్కడం, మామూలుగా అన్నీ చక్కాపోయాయి. అమ్మ ఏమేమో టిఫిన్సు చేసింది.

మధ్యాహ్నం నాలుగు గంటలకు వాళ్ళు వచ్చారు. కాఫీ టిఫిన్లు అయ్యాక నన్ను తీసుకుని వెళ్ళారు. నేనువెళ్ళి కూర్చుంటూ, నవ్వుకుంటూ మెల్లిగా తలెత్తి అతనిమొగం చూశాను.

ఎవరు? మూర్తి...మూర్తి...మూర్తికాదూ? బొద్దుగా బూట్సు వేసుకున్నాడు కాని—మూర్తి కాదూ? అవును. ఈ వీధంట వెళ్తుంటాడు. హెల్త్ ఇన్స్పెక్టరుగారి స్నేహితబృందంతో ఇతనుకూడా వుండివుంటాడు. నేను మూర్తినే మనసులో పెట్టుకుని ఆమె నడగడంవల్ల, ఆమె మనసులో రియాక్షన్ జరిగి, మూర్తినే వూహించి, మూర్తినే చూపించింది.

కాని మూర్తెక్కడ, ఇతనెక్కడ—నక్కకూ నాగలోకానికీ వున్నంతదూరం! ఆ గోధుమవన్నె ఛాయా, కాటుక పెట్టినట్లున్న సోగకళ్ళూ, ఎగిరెగిరి పడుతూండే, వుంగరాల జుత్తూ ... మూర్తి కాదూ!?

అసలే నీరసంగా ఉన్న నా శరీరానికి మైకం కమ్మినట్లయింది. తల దిమ్మెపోయింది. మొగం తిరిగిపోయింది.

★

---

(34వ పేజీ తరువాయి)

కాంగ్రెసు తీర్మానమూ ... ప్రభుత్వ విధానమూ ... భవిష్యత్ లో భారీయెత్తున వారు సాగించనున్న బ్రహ్మాండమైన ప్రణాళికలూ... 'సోషలిజం' మీద వివిధ నాయకుల నిర్వచనాలూ ప్రతిపక్షీయుల బ్రహ్మాండమైన అభ్యంతరాలూ— అమూల్యమైన సూచనలూ మాట దేవుడెరుగు. వారి వారి "రాజకీయ స్వప్రయోజనాలు" ఏదో ఒక మోతాదులో యిమిడి ఉంటాయన్న సహజ సిద్ధాంతాన్నే 'ఔ' ననుకుందాం.

అసలు విషయం,

చెప్పే పెద్దలు చేయవలసింది ఏమిటి? కనీసం నూరింట ఒక పాలైనా ఆచరణయోగ్యం కాని సలహాలను అర్థంలేకుండా ఇచ్చేసినందువల్ల వచ్చే నే లాభం ఏమిటీ? అన్నదే. ఏదేమైనా—

బ్లేడ్లతో ముఖక్షౌరం... సోపు, స్నో, పౌడర్, బూట్లూ మొదలైన విలాసకర వస్తువుల నన్నిటినీ విసర్జించేసి... కాలేజీ విద్యార్థులమైన మనం గెడ్డాలు పెంచుకుని, కొల్లాయి గుడ్డతో... యథాశక్తిని శ్రమదానంచేస్తూ ... అపరసన్యాసులమై సదరుపర్యులు... భవిష్యత్ లో స్థాపించబోయే(?) —వంటి సమాజ స్థాపనకై వర్తమానంలో ఎదురు చూస్తూకూర్చుందాం. తప్పౌతుందా మరి?

★